వట్టినాగులపల్లిలో జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణాలపై అధికారుల పంజా

- సర్కారు భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు: గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ, మార్చి 27: ప్రభుత్వ స్థలాలను అక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పుప్పాలగూడ గ్రామ సర్వే నం.290లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన నాలుగు నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన కూల్చివేశారు. విలువైన సర్కార్ భూముల్లో కొంత మంది రాజకీయ నాయకుల అండ దండలను చూసుకొని అక్రమార్కులు గత కొన్ని రోజులుగా గండిపేట మండలంలో రెచ్చిపోతున్నారన్నారు. పుప్పాలగూడ గ్రామ పరిధిలోని సర్వే నం. 290లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను బుధవారం పరిశీలించి కూల్చివేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులను గతంలో రెవెన్యూ కార్యాలయానికి పిలిచి వివరాలు తెలిపినా బేఖాతరు చేస్తూ రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. అదే విధంగా మండల పరిధిలోని బండ్లగూడ, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, నార్సింగి, వట్టినాగుల పల్లి, ఖానాపూర్ తదితర గ్రామాల్లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గుర్తించి తక్షణమే కూల్చివేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్మాణాల కూల్చివేతలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సురేశ్, విక్రం రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బల్దియా ఆదాయానికి గండి

- నిధులు లేక ఆగిపోయిన అభివృద్ధి
- ఆదాయానికి గండి కొడుతున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాల జోరు

సాగర్ రహదారిపై శ్రీపురం కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భారీ వాణిజ్య షెడ్డు

వనస్థలిపురం, మార్చి 27: జీహెచ్‌ఎంసీలో నిధులు లేక అభివృద్ధి నిలిచిపోతోంది. 6నెలలుగా వీధిలైట్లు కూడా రాని పరిస్థితి ఉంది. జీహెచ్‌ఎంసీకి ఆదాయాన్ని సమకూర్చాల్సిన సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు దీనికి నిదర్శనంగా ఉంటోంది. అక్రమంగా కనీస అనుమతులు లేకుండా వెలుస్తున్న వాణిజ్య షెడ్లు, అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాలే దీనికి అద్దం పడుతున్నాయి.

ఎలాంటి అనుమతులు లేకుండా...

ప్రధాన రహదారుల్లో వ్యాపారం చేసేందుకు ఇబ్బడిముబ్బడిగా షెడ్లు నిర్మిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ షెడ్ల నిర్మాణం జరుగుతుంది. సాగర్ రహదారిలో శ్రీపురం కాలనీ వద్ద 500 గజాల్లో పెద్ద షెడ్డును నిర్మిస్తున్నారు. నిత్యం రహదారుల వెంట తిరిగే టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కనిపించక పోవడం హాస్యాస్పదం. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నారు. వైదేహినగర్ ప్రధాన రహదారిలో వాణిజ్య, నివాస నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా సాగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాచకాల్వను ఆక్రమించి నిర్మాణాలు...

సాహెబ్‌నగర్ శివారు నుంచి వెళ్లిన రాచకాల్వను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నా, వాటిపై ఫిర్యాదులు వస్తున్నా టౌన్‌ప్లానింగ్ శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఓ వ్యక్తి కాల్వపై నుంచే నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని సౌభాగ్యనగర్ కాలనీవాసులు వాపోతున్నారు. క్షేత్ర స్థాయిలో తిరిగే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చక్రం తిప్పుతున్నారు. నిర్మాణదారులతో మాట్లాడుకుని ఓ అవగాహనకు వస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వారి పేర్లు, ఫోన్ నంబర్లు సదరు నిర్మాణదారులకు అందజేస్తున్నారని తెలుస్తోంది. టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యవహారంపై కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో జరగుతన్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైదేహినగర్ ప్రధాన రహదారి సమీపంలో నిర్మిస్తున్న ఓ భవనం

సౌభాగ్య నగర్‌లో రాచకాల్వపై నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న నిర్మాణాలు

త్వరలోనే కూల్చివేతలు చేపడతాం..

అక్రమ నిర్మాణాలపై త్వరలోనే కూల్చివేతలు చేపడతాం. వచ్చే శనివారం గుర్తించిన అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధం చేశాం. రాచకాల్వపైన ఇండ్లు నిర్మిస్తున్న విషయం మా దృష్టికి కూడా వచ్చింది. దానిపై ఇరిగేషన్ అధికారులను రిపోర్టు అడిగాం. ఇరిగేషన్ శాఖ అధికారులు అసంపూర్ణంగా రిపోర్టు ఇవ్వడంతో కాల్వను గుర్తించలేక పోతున్నాం. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేసి కూల్చివేతలు చేపడతాం. సిబ్బంది కొరత కారణంగా కొంత ఆలస్యం అవుతోంది.

– పావని, హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి సమస్యలను తెలుపుతున్న చైతన్యపురిలోని ఫుట్‌పాత్ వ్యాపారులు

ట్రాఫిక్ చిక్కులు లేకుండా.. ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకోవాలి

ఎల్బీనగర్, మార్చి 27: ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోవాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగితే పోలీసులు చర్యలు తీసుకుంటారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి మెట్రో స్టేషన్ పరిసరాల్లో పండ్ల వ్యాపారాలు చేసుకునే వారు తమను వ్యాపారం చేసుకోకుండా అడ్డుకుంటున్నారంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డుపై ఇబ్బందులు కలిగే విధంగా ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తే పోలీసులు అడ్డుకుంటారని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకుంటే మంచిదని అన్నారు. ఈ విషయంలో తాను ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆధ్మాత్మిక చింతనను అలవర్చుకోవాలి

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

ఆర్కేపురం, మార్చి 27: ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తెలిపారు. ఆర్కేపురం డివిజన్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో తీగల కృష్ణారెడ్డి పాల్గొని.. ఆంజనేయస్వామి, దుర్గ మల్లేశ్వర స్వామి, కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణాపురంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చాలా పవిత్రత ఉన్న దేవాలయమని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సరూర్‌నగర్, ఆర్కేపురంలోని కాలనీలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయించామని తెలిపారు. ఖిల్లా మైసమ్మ, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్, ముప్పిడి లింగస్వామిగౌడ్, చామల శైలజా రెడ్డి, పగిళ్ళ భూపాల్‌రెడ్డి, పగడాల ఎల్లన్న, ఆలయ మాజీ చైర్మన్ జగిని రమేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మణికొండ, మార్చి 27: వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మణికొండ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ అధికారులు, జల మండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా తదితర వాటిపై అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నాగులమ్మ దేవాలయం వద్ద వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకోని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నీటి వృధా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీనారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎస్వీ కృష్ణప్రసాద్, మాజీ కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, మల్లారపు శాలిని, సునీల్‌బాబు తదితరులు

హస్తం గూటికి తెలుగు తమ్ముళ్లు

- మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేతలు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 27: ఎల్బీనగర్‌లోని టీడీపీ ఖేల్ ఖతం దుకాణం బంద్ అనే చందంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో టీడీపీ కనుమరుగు కానుంది. గతంలో బీఆర్ఎస్‌లోకి భారీగా వలసలు రావడంతో అప్పటికే దాదాపుగా పచ్చజెండా పార్టీ ఖాళీ అయ్యింది. ప్రస్తుతం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లంతా హస్తం పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీనగర్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎస్వీ కృష్ణప్రసాద్ సిద్ధమయ్యారు. అయితే అనూహ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు తమ పార్టీ తెలంగాణలో పోటీ చేయడం లేదనే ప్రకటన ఎస్వీ కృష్ణప్రసాద్ ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. దీంతో పార్టీ క్యాడర్ తీవ్ర నైరాశ్యానికి గురయ్యిందనే చెప్పాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కృష్ణప్రసాద్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట టీడీపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు ఎం.సునీల్‌బాబు, టీడీపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు వెలక చంద్రశేఖర్, చంపాపేట ఉపాధ్యక్షుడు ఆర్.కృష్ణతో పాటు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారినట్లేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత సామ రమణారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, మాజీ ఏరియా కమిటీ మెంబర్లు ఖాదర్, ఆకుల రమాకాంత్ గుప్తా, బెక్కెం లక్ష్మీనారాయణ, మెట్టు వెంకట్‌రెడ్డి, గంగబాబు, 200 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు. చంపాపేట, మార్చి 27

స్కాలర్‌షిప్స్, ఫీజులు విడుదల చేయాలి

శంషాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్

శంషాబాద్ రూరల్, మార్చి 27 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం శంషాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కార్యదర్శి బి.శంకర్, అధ్యక్షుడు కే వై ప్రణయ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసాద్‌చారి, కార్యదర్శిగా కౌశిక్, ఉపాధ్యక్షుడిగా సోహైల్, జయశ్రీ, అర్జున్, వెనుప్రకాశ్, సహాయ కార్యదర్శిగా వైష్ణవి, తరుణ్, రోహిత్, అనుష్క, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్, శివ, హర్ష, సాయిరాజ్, చరణ్, వంశీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బీజేవైఎం భాగ్యనగర జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎ.భరత్‌ను సన్మానించి అభినందనలు తెలుపుతున్న మూసారాంబాగ్ కార్పొరేటర్ భి.భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి. చిత్రంలో డివిజన్ నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, సంతోష్, రోహన్, దినేశ్, మల్లేశ్, విశాల్, సురేందర్, మనోజ్ తదితరులు ఉన్నారు.
– మలక్‌పేట, మార్చి 27

రిజర్వేషన్లను అమలు చేయాలి

బండ్లగూడలోని జీఎస్ఐలో నేషనల్ కమీషన్ సభ్యుడు షెడ్యూల్డ్ క్యాస్ట్ వడ్డేపల్లి రాంచందర్‌ను సన్మానిస్తున్న ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్, మార్చి 27: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తప్పకుండా అమలు చేయాలని నేషనల్ కమీషన్ సభ్యుడు షెడ్యూల్డ్ క్యాస్ట్ వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయం ప్రాంగణంలోని మల్టీపర్పస్ హాల్లో బుధవారం జీఎస్ఐలో రిజర్వేషన్స్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్, జనరల్ లెక్చర్ ఫర్ ఎస్సీ, ఎస్టీ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డేపల్లి రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. రిజర్వేషన్ల ప్రాతిపదికపై పదోన్నతులు కల్పించడంతో పాటు జీఎస్ఐలో ఎప్పటికప్పుడు ఎస్సీ, ఎస్టీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఏవైనా తప్పులు జరిగితే నేరుగా తనను సంప్రదించాలని జీఎస్ఐ ఉద్యోగులకు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ కమీషన్ సభ్యుడైన వడ్డేపల్లి రాంచందర్‌ను జీఎస్ఐ ఏడీజీ అండ్ హెచ్‌ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదార్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న జీఎస్ఐ ఏడీజీ అండ్ హెచ్‌ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావును నేషనల్ కమీషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ డీడీజీలు ఎల్‌పీ సింగ్, ఎస్ఎన్ మహాపాత్ర, డైరెక్టర్ నేషనల్ కమీషన్ ఫర్ ఎస్సీ జి. సునీల్‌కుమార్‌బాబు, రీసెర్చ్ ఆఫీసర్ వరప్రసాద్, డైరెక్టర్లు ఎంఎల్ దొర, అనూప్ ఎన్ కాంబ్లే, ఎస్. తారకేశ్వర్‌రాయి, అసోసియేషన్ ప్రతినిధులు జి. శ్రీనివాసరావు, కిశోర్‌కుమార్, బి.ఆనంద్‌కుమార్, ఆర్.అరుణ్‌కుమార్, చక్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట సంతోష్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

మాదన్నపేట, మార్చి 27: రానున్న లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మాదన్నపేట, సంతోష్‌నగర ఏసీపీ కార్యాలయం నుంచి ప్రారంభించి చావునీ, కుర్మగూడ, భరత్‌నగర్ ఓల్డ్ సంతోష్‌నగర్, ఎంబీ హట్స్ తదితర సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీసీపీ జానకి, ఏసీపీలు వెంకన్న, గౌస్, సీఐలు శ్రీనివాస్ గౌడ్, రఘు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన

మన్సూరాబాద్, మార్చి 27: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగోల్ డివిజన్ పరిధి జైపురికాలనీలో టౌన్ లెవల్ మహిళా సంఘం సభ్యులకు సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగం అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ర్యాలీ నిర్వహించి ఇంకుడు గుంతల ఆవశ్యకతను మహిళలకు తెలియజేశారు. నీటి సంరక్షణపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హయత్‌నగర్ ప్రాజెక్టు ఆఫీసర్ బలరాం మాట్లాడుతూ.. నీటిని వృథా చేయడం వలన కలిగే అనర్థాలపై స్లమ్ లెవల్ ఫెడరేషన్‌లో మహిళా సంఘం సభ్యులు చర్యలు జరపాలని సూచించారు. రాబోయే వర్షాకాలంలో పడే ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టుకునే విధంగా కాలనీలవాసులు కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ విధిగా తమ ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలు వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అర్చన, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్. నాగబ్రహ్మచారి, రాజు, మమత, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జైపురికాలనీలో నీటి సంరక్షణ, వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం..

ఉప్పల్, మార్చి 27: కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు అన్నారు. చిలుకానగర్, హబ్సిగూడ డివిజన్లలోని పలు కాలనీల్లో బుధవారం అధికారులతో కలిసి డీసీ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల విజ్ఞప్తుల మేరకు అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని బ్యాంక్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పలు సమస్యలను డీసీకి తెలియజేశారు. నీటివృథా, ధర్మపురికాలనీలో జీవీపీ పాయింట్ తొలగించాలని కోరారు. డ్రైనేజీ సమస్యలపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా హబ్సిగూడ డివిజన్‌లోని నందనవనం కాలనీలో అపార్టుమెంట్ వాసుల ఫిర్యాదు మేరకు పర్యటించారు. ఈ మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శాని టేషన్ డీఈ చందన, సూపర్‌వైజర్ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించి అన్ని రంగాల కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన వినతిపత్రాన్ని కరపత్రం రూపంలో బుధవారం విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి అధ్యక్షతన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కాటేదాన్ ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ హాజరై కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని ప్రకటించాలని ప్రజా పాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డిని సీఐటీయూ కొత్తగా ప్రభుత్వం ఏర్పడగానే లేఖ అందించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినా రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజశేఖర్(ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 27: వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్ తండాకు చెందిన సభావత్ రాజశేఖర్(27)గత కొంత కాలం నుంచి పని చేయకుండా ప్రతిరోజు మద్యం సేవిస్తున్నాడు. ఈనెల 18న మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తాళం వేసుకొని పడుకున్నాడు. దీంతో తల్లి లక్ష్మి మందలించడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.